సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

గురువారం । 22 । ఫిబ్రవరి । 2024



వనదేవతల జాతర షురూ..

జిల్లాలోని పలు ప్రాంతాల్లో సమ్మక్క-సారలమ్మ జాతర ఘనంగా ప్రారంభమైంది. భక్తులు అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. 9లో



ఘాటెక్కిన వెల్లుల్లి

ప్రతి వంటకంలో వినియోగించే వెల్లుల్లి ధర భారీగా పెరిగింది. దీంతో కొనుగోలు చేయలేక పోతున్నామని పలువురు అంటున్నారు. 10లో

గరిష్టం / కనిష్టం
35° / 22°

వాతావరణం

జిల్లాలో గురువారం మధ్యాహ్నం ఎండల ప్రభావం అధికంగా ఉంటుంది. రాత్రికి వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు వైభవంగా స్నపన తిరుమంజనం



కర్ణాటకలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారికి బుధవారం స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ప్రతి బుధవారం స్వామివారి ఉత్సవ మూర్తులకు ఈ వేడుక నిర్వహించడం ఆనవాయితీ. తెల్లవారు జామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

కర్ణాటకలో రామయ్య కల్యాణం

కర్ణాటకలోని కోలార్ జిల్లాలో బుధవారం భద్రాచల సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. భక్తుల కోరిక మేరకు ప్రచార రథం ద్వారా స్వామివారు అక్కడికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై స్వామివారి కల్యాణ వేడుకను దేవస్థానం అర్చకులు కమనీయంగా జరిపించారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

చెక్‌పోస్టుల ఏర్పాటు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. పినపాక మండలంలో బయ్యారం క్రాస్‌రోడ్, మణుగూరులోని అంబేద్కర్ సెంటర్, మణుగూరు మండలం రామానుజవరం, బూర్గంపాడు మండలం మోరంపల్లిబంజర, భద్రాచలం బ్రిడ్జి పాయింట్, దుమ్ముగూడెం మండలం లక్ష్మీనగరం, తూరుబాక బ్రిడ్జి పాయింట్, చర్ల మండలం సత్యనారాయణ పురం, పాత చర్ల, పూసుగుప్ప ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

కేజీబీవీలో సమస్యలపై విచారణ



కూరను పరిశీలిస్తున్న అన్నామణి

టేకులపల్లి : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో నెలకొన్న సమస్యలపై జిల్లా కో ఆర్డినేటర్ అన్నామణి బుధవారం విచారణ నిర్వహించారు. కేజీబీవీలో నాణ్యమైన భోజనం పెట్టడం లేదని, ప్రశ్నిస్తే వేధింపులు తప్పడం లేదని విద్యార్థులు ఆందోళన చేసి, సమస్యలను స్థానిక ఎమ్మెల్యే కోరం కనకయ్య దృష్టికి తీసుకెళ్లిన విషయం విదితమే. ఈ మేరకు పాఠశాలను సందర్శించిన అన్నామణి.. పాఠశాల ఎస్‌ఓ సంతును వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాలికలతో మాట్లాడి తరగతుల వారీగా ఎదుర్కొంటున్న సమస్యలను లిఖిత పూర్వకంగా తీసుకున్నారు. విచారణ అనంతరం డీఈఓకు నివేదిక అందజేస్తామని తెలిపారు.

వంట సామగ్రి సరఫరాకు దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలంటౌన్: జిల్లాలో గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో గల పాఠశాలలు, వసతిగృహాలకు అవసరమైన వంట సామగ్రి, ఇతర వస్తువుల సరఫరాకు అర్హులైన ఏజెన్సీల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఐటీడీఏ పీఓ ప్రతీక్ జైన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల ఏజెన్సీల యజమానులు ఈనెల 22 నుంచి 27 వరకు ఐటీడీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బాక్స్‌లో పూర్తి వివరాలతో దరఖాస్తులను వేయాలని సూచించారు. ఈనెల 28న దరఖాస్తుదారుల సమక్షంలో బాక్స్ తెరిచి తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. దరఖాస్తుదారులు సమర్పించిన శాంపిళ్లను వెంట తీసుకురావాలని సూచించారు.

3న బెంచ్ ప్రెస్ పోటీలు

భద్రాచలంటౌన్: భద్రాచలం సిటీస్టైల్ జిమ్, జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మార్చి 3న 6 జిల్లాల స్థాయి బెంచ్ ప్రెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.మల్లేష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక గిరిజన అభ్యుదయ భవన్‌లో జరిగే ఈ పోటీలకు ఎంట్రీ ఫీజు రూ.300 చెల్లించి క్రీడాకారులు పేరు నమోదు చేయించుకోవాలని సూచించారు. పురుషులు, మాస్టర్స్, మహిళా విభాగాల్లో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. క్రీడాకారులకు ఉచిత భోజన సదుపాయం ఉంటుదని, ఆసక్తి గల వారు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

సర్కారు సాయమందేనా?

భక్తుల కోర్కెలు తీర్చే అందరి బంధువైన భద్రగిరి రామయ్య ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నాడు. దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచల క్షేత్రంలో జరిగే ప్రధాన ఉత్సవాల నిర్వహణ ఖర్చులు ఆలయానికి మోయలేని భారంగా మారుతున్నాయి. భక్తులు సమర్పించే హుండీ ఆదాయంతోనే వేడుకలు నిర్వహించాల్సి వస్తోంది. ఆలయ అభివృద్ధి మాట అటుంచితే.. ఉత్సవాల నిర్వహణకే అధికారులు దిక్కులు చూడాల్సిన పరిస్థితి నెలకొంది. వచ్చే శ్రీరామనవమి ఉత్సవాల నాటికైనా రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించకపోతుందా అని వారు ఆశగా ఎదురుచూస్తున్నారు.

– భద్రాచలం



రామాలయం వ్యూ

ప్రభుత్వ నిధుల కోసం ఎదురుచూస్తున్న భద్రాద్రి రామయ్య

- భారమవుతున్న ఉత్సవాల నిర్వహణ
- భక్తులు సమర్పించే కానుకలే దిక్కు
- కొత్త ప్రభుత్వంపై కోటి ఆశలు

హుండీ ఆదాయంతోనే..

భద్రాచలంలో ప్రధానంగా ముక్కోటి ఏకాదశి, శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలు పెద్ద ఎత్తున జరుగుతాయి. ఈ రెండు ఉత్సవాలకు దేశ నలుమూలల నుంచి భక్తులు వస్తుంటారు. ఇలా దేశవ్యాప్తంగా అత్యంత ప్రాధాన్యత సంతరించుకోవడంతో వేడుకల విజయవంతానికి ఆలయ అధికారులు సైతం ఎంత ఖర్చయినా వెనుకాడరు. ముక్కోటి ఉత్సవాలకు సుమారు రూ.కోటి, శ్రీరామనవమి ఉత్సవాలకు రూ.1.50 కోట్లకు పైగానే నిధులు వెచ్చిస్తుంటారు. అయితే ఈ మొత్తంలో ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా అందకపోవడంతో వ్యయమంతా హుండీ ఆదాయం నుంచే పెట్టాల్సి వస్తోంది. దేవస్థానానికి సాధారణంగా 30 నుంచి 45 రోజులకు సుమారు రూ.కోటి ఆదాయం సమకూరుతుంది. ఇందులో నుంచే అధికారుల జీతభత్యాలు, దేవస్థానం నిర్వహణ, ఇతర ఖర్చులు ఉంటాయి. దీంతో రామాలయం అభివృద్ధికి నిధులు మిగలడం లేదు. కేవలం ఆలయ నిర్వహణ, ఉత్సవాల విజయవంతానికే వచ్చే ఆదాయం బొటాబొటిగా సరిపోతోంది.

ఈ ప్రభుత్వమైనా దృష్టి సారించేనా..?

తెలంగాణలో కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా రామయ్య ఉత్సవాల నిర్వహణకు సాయం అందిస్తుందా అని భక్తులు ఎదురుచూస్తున్నారు. గత పదేళ్లలో సీఎంగా ఉన్న కేసీఆర్ రెండు సార్లు మాత్రమే సీతారాముల కల్యాణానికి హాజరయ్యారు. ఆ తర్వాత మంత్రులు మాత్రమే అధికారికంగా పాల్గొన్నారు. ఈ సమయంలో సైతం ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం సాయమందించాలని కోరినా పెడచెవిన పెట్టారు. అంతేకాక భద్రాచలం అభివృద్ధికి కేసీఆర్ ప్రకటించిన రూ.100 కోట్ల హామీ నెరవేర్చకపోవడంతో భక్తులు, స్థానికులు సైతం ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. ఉత్సవాల నిర్వహణకు నిధులు ఇవ్వకపోగా, స్వామి వారికి ప్రతి ఏడాది ప్రభుత్వం లాంఛనంగా అందజేసే పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలకు సైతం నిధులు కేటాయించలేదనే అపవాదును బీఆర్‌ఎస్ ప్రభుత్వం మూటగట్టుకుంది. భద్రాచలం నియోజకవర్గంలో రూ. 100 కోట్ల హామీనే ప్రధాన ప్రచారాస్త్రంగా వాడిన కాంగ్రెస్.. ఇప్పుడు రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో ఈ ప్రభుత్వమైనా నిధులు కేటాయించకపోతుందా అని భక్తులు ఆశలు పెట్టుకున్నారు. ప్రతి ఏడాది రూ.5 కోట్లు ఉత్సవాల నిర్వహణకు విడుదల చేయాలని వేడుకుంటున్నారు.

నానాటికీ పెరుగుతున్న వ్యయం..

ప్రతి ఏడాది డిసెంబర్, జనవరి నెలల్లో ముక్కోటి, ఏప్రిల్‌లో శ్రీరామనవమి, పట్టాభిషేక మహోత్సవాలు జరుగుతాయి. ఈ ఉత్సవాలలో లైటింగ్, పెయింటింగ్, తాత్కాలిక పనులు, చలువ పందిళ్లు, ఏసీలు, ఎల్‌ఈడీలు తదితర పనుల నిమిత్తం దేవస్థానం నుంచి నిధులు కేటాయిస్తున్నారు. అయితే ముక్కోటికి గతంలో రూ.50 లక్షలు ఉండగా, ప్రస్తుతం సుమారు రూ.కోటి వరకు, శ్రీరామనవమికి రూ.80 లక్షల నుంచి ప్రస్తుతం రూ.1.50 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటికే పనుల నిమిత్తం సుమారు రూ.1.50 కోట్లకు ఆలయ అధికారులు టెండర్లు ఖరారు చేశారు.

అయితే ఈ ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని అటు భక్తులు, ఇటు ఆలయ అధికారులు కోరుతున్నా కార్యరూపం దాల్చడం లేదు. రాష్ట్రంలో ప్రతి రెండేళ్లకోసారి జరిగే మేడారం జాతర వంటి ఉత్సవాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తున్న నేపథ్యంలో దేశవ్యాప్తంగా పేరుగాంచిన భద్రాచలంలో జరిగే రాముడి ఉత్సవాలకు కనీస ఖర్చుల కోసం నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు. ప్రభుత్వం నుంచి సాయం అందితే దేవస్థానం నిధులను భక్తులకు మెరుగైన వసతుల కల్పనకు, ఆలయ అభివృద్ధికి ఖర్చు చేసే అవకాశం ఉంటుందని పలువురు భావిస్తున్నారు.

ఆలయ ఆదాయం నుంచే ఉత్సవాల నిర్వహణ



భద్రాచలంలో జరిగే ఉత్సవాలను దేవస్థానానికి వచ్చే హుండీ ఆదాయం నుంచే ఖర్చు చేస్తున్నాం. ఉద్యోగుల జీతభత్యాలు, ఇతర ఖర్చులకు కూడా ఈ డబ్బే వెచ్చిస్తున్నాం. ఈ ఏడాది ఉత్సవాల నిర్వహణకు నిధులు కేటాయించాలని మా శాఖ ఉన్నతాధికారులు, కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి విన్నవిస్తాం.

– ఎల్ రమాదేవి, ఈఓ

ఇస్తారా.. ఆపుతారా?!

- నామినేటెడ్ పదవుల భర్తీపై ఉత్కంఠ
- కొన్నాళ్ల క్రితమే రాష్ట్రస్థాయి పదవులు రద్దు
- లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండడంతో ఆశావహుల్లో ఆరాటం
- నోటిఫికేషన్ విడుదలైతే పదవుల భర్తీలో ఆలస్యం!
- పార్టీ విధేయులకు కట్టబెట్టేలా నేతల కసరత్తు



సాక్షిప్రతినిధి, ఖమ్మం: నామినేటెడ్ పదవులపై కాంగ్రెస్ నేతలు గంపెడాశతో ఉన్నారు. జిల్లా, రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవులు పొందడం కోసం ఆశావహుల తమ ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవులను రద్దు చేయగా.. జిల్లాస్థాయిలోనూ పలు పదవులను భర్తీచేయాల్సి ఉంది. ఈ నేపథ్యాన లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండగా.. ఆలోపే పదవులు భర్తీచేస్తారా, ఎన్నికల తర్వాతే పదవుల పందేరం ఉంటుందా అనే సందిగ్ధంలో ఆశావహులు ఉన్నారు. అయితే, పదవులు ఎప్పుడు భర్తీ చేసినా తమకే దక్కేలా నేతలు లాబీయింగ్‌లో మునిగి తేలుతున్నారు.

రాష్ట్రస్థాయి పదవులే లక్ష్యం

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని పది అసెంబ్లీ స్థానాలకు మిత్రపక్షమైన సీపీఐతో కలిసి కాంగ్రెస్ తొమ్మిది స్థానాలను దక్కించుకుంది. అలాగే మల్లు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుకు మంత్రి పదవులు దక్కాయి. ఈ నేపథ్యాన జిల్లా నుంచి రాష్ట్రస్థాయి పదవులు ఆశిస్తున్న వారి సంఖ్య భారీగానే ఉంది. ఈ ముగ్గురు నేతల అనుచరుల్లో రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందిన నేతలు ఉండగా.. పార్టీ అధికారంలోకి రావడంతో వీరంతా రాష్ట్రస్థాయి పదవులనే ఆశిస్తున్నారు. బీఆర్‌ఎస్ హయాంలో కూడా జిల్లాకు చెందిన కొండబాల కోటేశ్వరరావుకు రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్, బొర్రా రాజశేఖర్‌కు మార్క్‌ఫెడ్ వైస్ చైర్మన్, పిడమర్తి రవికి ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పదవులు దక్కాయి. దీంతో కాంగ్రెస్ హయాంలో కూడా జిల్లా నేతలకు రాష్ట్రస్థాయి పదవులు దక్కుతాయనే ప్రచారం జరుగుతోంది.

జిల్లాస్థాయిలోనూ..

ఇక జిల్లాస్థాయి నామినేటెడ్ పదవులను ఆశిస్తున్న వారి సంఖ్య తక్కువగా ఏమీ లేదు. ఓ పక్క రాష్ట్రస్థాయి పదవుల కోసం ప్రయత్నిస్తూనే అది దక్కకపోతే ఉమ్మడిజిల్లా, జిల్లాస్థాయి పదవులు దక్కించుకోవాలనే వ్యూహంతో పలువురు నేతలు ఉన్నారు. పదేళ్ల తర్వాత కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఎలాగైనా పదవి పొందాలనే దృఢ నిశ్చయంతో ఉన్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం నామినేటెడ్ పదవులను రద్దు చేసిన నాటి నుంచే ఆశావహులు తమ ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 14 వ్యవసాయ మార్కెట్లతో పాటు ఆలయాల పాలకవర్గాలు, ఇతర నామినేటెడ్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉంది. దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాద్రి సీతారామచంద్రస్వామి ఆలయంతో పాటు తెలంగాణ తిరుపతిగా పేరున్న జమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయాలకు పాలకవర్గాలను నియమించాల్సి ఉంది.

త్వరలోనే లోక్‌సభ నోటిఫికేషన్

మరికొద్ది రోజుల్లో పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉంది. ఈ తరుణాన నామినేటెడ్ పదవులను ఆశిస్తున్న నేతలు తమ అదృష్టాన్ని పరీక్షించుకునే యత్నాల్లో ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవులను రద్దు చేయగా.. పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి పదవులను కట్టబెట్టాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. దీంతో త్వరలోనే నామినేటెడ్ పోస్టుల భర్తీ ఉంటుందని పలువురు భావించగా.. ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు పూర్తి కావొస్తున్నా అడుగులు పడలేదు. మొదట్లో లోక్‌సభ ఎన్నికలకు ముందే నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తారనే ప్రచారం జరిగినా.. ఇప్పుడు ఎన్నికల తర్వాత జరుగుతుందా అనే మీమాంస నెలకొంది. ఎన్నికల ముందు నామినేటెడ్ పోస్టులు భర్తీ చేస్తే పదవులు రాని వారు పార్టీ అభ్యర్థుల తరఫున పనిచేయరనే భావనతో కొంత కాలం ఆపుతారని ప్రచారం జరుగుతుండడంతో ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది.

జాబితా పెద్దదే..

జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులకు ప్రధాన అనుచరులుగా ఉన్న నేతలు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులను ఆశిస్తున్నారు. భట్టికి ప్రధాన అనుచరులుగా మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావుతో పాటు రాయల నాగేశ్వరరావు, నాగా సీతారాములు, పువ్వాళ దుర్గాప్రసాద్, జావీద్ కొనసాగుతున్నారు. అలాగే పొంగులేటికి బొర్రా రాజశేఖర్, మువ్వా విజయ్‌బాబు, తుళ్లూరి బ్రహ్మయ్య, ముదిరెడ్డి నిరంజన్‌రెడ్డి, మద్దినేని బేబిస్వర్ణకుమారి, మేకల మల్లిబాబు, తుమ్మలకు మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, సాధు రమేష్‌రెడ్డి, కమర్తపు మురళి, చావా నారాయణ అనుచరులుగా ఉన్నారు. ఇందులో కొందరు నామినెటెడ్, మరికొందరు ఎమ్మెల్సీ పదవులు ఆశిస్తున్నట్లు సమాచారం.

పరీక్షలకు సర్వం సిద్ధం

- కలెక్టర్ ప్రియాంక ఆల వెల్లడి
- ఈనెల 28 నుంచి ఇంటర్ వార్షిక పరీక్షలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రియాంక తదితరులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఇంటర్ పరీక్షలకు సర్వం సిద్ధం చేశామని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల అన్నారు. పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై బుధవారం ఐడీఓసీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈనెల 28 నుంచి మార్చి 19 వరకు పరీక్షలు జరుగనున్నాయని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 36 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని, మొదటి సంవత్సరం 10,200 మంది, ద్వితీయ సంవత్సరం 9,277 మంది విద్యార్థులు హాజరవుతారని చెప్పారు. అన్ని కేంద్రాల్లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 16 పోలీస్‌స్టేషన్లలో ప్రశ్నపత్రాలు భద్రపరిచామని, 36 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 36 మంది శాఖాపరమైన అధికారులు, 13 మంది అదనపు పర్యవేక్షకులు విధులు నిర్వహిస్తారని వివరించారు. మూడు సిట్టింగ్ స్క్వాడ్‌లు, ఐదు కస్టోడియన్స్‌ను నియమిస్తున్నట్లు తెలిపారు. 550 మంది ఇన్విజిలేటర్లకు విధులు కేటాయించామని చెప్పారు. పరీక్షల సమయంలో ఆయా కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్లను మూసివేయించాలని అధికారులకు సూచించారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని ఆశాఖ అధికారులకు సూచించారు. పరీక్షల నిర్వహణకు విధులు కేటాయించిన సిబ్బందికి శిక్షణ ఇచ్చేందుకు షెడ్యూల్ తయారు చేయాలని ఇంటర్మీడియట్ అధికారి సులోచనారాణికి సూచించారు. విద్యార్థులు పరీక్షల విషయంలో ఏమైనా సందేహాలుంటే జూనియర్ అసిస్టెంట్లు బి.బిక్షం(9704661714), ఇ.శివకుమార్ (9346913069)ను సంప్రదించాలన్నారు. సమావేశంలో డీఆర్‌ఓ రవీంద్రనాథ్, డీఎంహెచ్‌ఓ శిరీష, డీఈఓ వెంకటేశ్వరాచారి, విద్యుత్ అధికారులు వెంకటరత్నం, ప్రభాకర్‌రావు, కొత్తగూడెం అడిషనల్ ఎస్పీ విజయబాబు, మున్సిపల్ కమిషనర్లు శేషు, మురళి పాల్గొన్నారు.

బాలోత్సవ్ పోస్టర్ల ఆవిష్కరణ

కొత్తగూడెంరూరల్: తెలంగాణ బాలోత్సవ్ పోస్టర్లను కలెక్టర్ ప్రియాంక అల బుధవారం ఐడీఓసీలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలోత్సవాలు విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని పెంపొందిస్తాయని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు కళా రంగంలోనూ రాణించాలని ఆకాంక్షించారు. సామాజిక దృక్పథంతో బాలోత్సవ్ వేడుకలను నిర్వహిస్తున్న కన్వీనర్ మద్దెల శివకుమార్‌ను అభినందించారు. అనంతరం ఎస్పీ రోహిత్‌రాజ్‌కు బాలోత్సవ్ ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి వేల్పుల విజేత, సింగరేణి రిటైర్డ్ జీఎం ఆనందరావు, గాయకులు అల్లి శంకర్, సినీ నటులు తాండూర్ ధనరాజ్, స్టీవెన్ లాజరస్ తదితరులు పాల్గొన్నారు.

అందని మందులు

- ఆయుష్ ఆస్పత్రులకు సక్రమంగా సరఫరా కాని గోలీలు, చూర్ణాలు
- ఇండెంట్ పెట్టినా పట్టించుకోని ఉన్నతాధికారులు
- మూడు నెలలకోసారి అంతంతమాత్రంగానే పంపిణీ
- కొన్ని ఆస్పత్రుల్లో వేధిస్తున్న వైద్యుల కొరత



జిల్లా సర్వజన ఆస్పత్రిలో వైద్యులు లేక మూసి ఉన్న ఆయుష్ డిస్పెన్సరీ

కొత్తగూడెంరూరల్: అల్లోపతి వైద్యంతో సైడ్ ఎఫెక్టులు వస్తాయనే భయంతో కొందరు ఆయుష్ (ఆయుర్వేదం, హోమియో, యునాని) ఆస్పత్రుల్లో మూలికలతో తయారు చేసిన మందుల వైపు ఆసక్తి కనబరుస్తారు. అయితే జిల్లాలోని ఈ ఆస్పత్రులకు కొన్ని నెలలుగా మందుల సరఫరాలో జాప్యం జరుగుతోంది. దీంతో ఆయా ఆస్పత్రులకు వెళ్తున్న ప్రజలు మందులు లేక నిరాశతో వెనుదిరుగుతున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలోని రెగ్యులర్ ఆయుష్ ఆస్పత్రులు 13 ఉన్నాయి. ఇందులో ఆయుర్వేదిక్ 8, హోమియో మూడు, యునాని రెండు ఉన్నాయి. ఇక ఎన్‌ఆర్‌హెచ్‌ఎం కింద 17 ఆస్పత్రులు ఉండగా ఇందులో ఆయుర్వేదిక్ 8, హోమియో 4, యూనాని 4, నేచరోపతి ఒక ఆస్పత్రి ఉన్నాయి. రెగ్యులర్ ఆస్పత్రుల నిర్వహణ రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో, ఎన్‌ఆర్‌హెచ్‌ఎం ఆస్పత్రుల నిర్వహణ కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉంటాయి. ఈ మొత్తం ఆస్పత్రులకు హైదరాబాద్‌లోని ప్రభుత్వ ఆయుర్వేద ఫార్మసీ నుంచి మందులు సరఫరా అవుతాయి. జిల్లాలోని ఆయుష్ ఆస్పత్రుల నుంచి మందులకు ఇండెంట్ పంపించినా రెండు, మూడు నెలలకోసారి మాత్రమే వస్తున్నాయి. దీంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. అల్లోపతి మందులు వాడితే కిడ్నీలపై ప్రభావం చూపుతుందని, ఇతర అనారోగ్య సమస్యలు వస్తాయని భావించే కొందరు ఆయుష్ మందులకు ప్రాధాన్యత ఇస్తున్నారు. అయితే ఈ ఆస్పత్రుల్లో వైద్య సేవలు అందుతున్నప్పటికీ.. సకాలంలో మందులు లేక వ్యాధులు తగ్గడం లేదని పలువురు అంటున్నారు. అన్ని ఆస్పత్రుల్లో మందుల కొరత సమస్య ప్రధానంగా వేధిస్తుండగా, రొంపేడు, చుంచుపల్లి, అశ్వారావుపేట, నాగుపల్లి ఆస్పత్రుల్లో మందులతో పాటు వైద్యుల కొరత కూడా ఉంది. దీంతో ఆయా ఆస్పత్రుల్లో కాంపౌండర్లే వైద్య సేవలు అందిస్తున్నారు.

ఆయుష్‌లో అందించే మందులివే..

ఆయుష్ ఆస్పత్రుల్లో జలుబు, దగ్గుకు తాలిశాది, సితోపాలది పొడి, వాత రోగాలకు యోగరాజ, సింహనాద, వాతగజాకుంసం, నొప్పులకు కర్పూర తైలం, ఆయాసానికి సితోపాలది చూర్ణం, మలబద్ధకానికి త్రిఫలా చూర్ణం, బీపీకి సర్పగంధ, చర్మ వ్యాధులకు చర్మరోగా నసిక వటి, టంకన భాష్పం, అజీర్తికి అవిపతీకార చూర్ణం, కుటజా గనపతి మాత్రలు ఇస్తుంటారు. అయితే ఈ మందుల సరఫరాలో తీవ్ర జాప్యం జరుగుతోంది.

వైద్యుల పోస్టులూ ఖాళీగానే..

జిల్లాలోని ఆయుర్వేదిక్, హోమియో ఆస్పత్రుల్లో వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రొంపేడు, చుంచుపల్లి, నాగుపల్లి ఆస్పత్రుల్లో ఆయుర్వేదిక్ వైద్యుల పోస్టులు, అశ్వారావుపేటలో హోమియో డాక్టర్ పోస్టు ఖాళీగా ఉన్నాయి. దీంతో ఆయా ప్రాంతాల వారికి వైద్యం అందని ద్రాక్షే అవుతోంది. ఎన్నో రోజులుగా ఈ ఖాళీలు ఉన్నా భర్తీకి ఉన్నతాధికారులు చర్యలు చేపట్టడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డులో స్థానం

చర్ల రూరల్: మండల కేంద్రంలోని గురుదేవ్ పాఠశాల విద్యార్థులు తెలుగు బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సంపాదించారని తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ పర్యవేక్షకులు వడుగు నాగపద్మిని తెలిపారు. అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం సందర్భంగా బుధవారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. కవి చిగురుమళ్ల శ్రీనివాస్ రచించిన తెలుగుభాష శతక పద్యార్చనలోని 101 పద్యాలను 110 మంది విద్యార్థులు 16 నిమిషాల వ్యవధిలో చదివి తెలుగు బుక్ ఆఫ్ రికార్డులో చోటు దక్కించుకున్నారని తెలిపారు. పాల్వంచ బొల్లోరిగూడెం ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు మామిడి రమేష్ మార్గదర్శకత్వంలో గురుదేవ్ పాఠశాల ఉపాధ్యాయులు ఎస్.విశాల, ఎం.విజయరాణి, ఎ.హేమలత, పి.సంధ్య, కె.నాగేంద్ర ప్రసాద్ పర్యవేక్షణలో విద్యార్థులు ప్రతిభ చాటారని వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఎంఈఓ జుంకీలాల్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గిరి ప్రసాద్, సుబ్రహ్మణ్యం తదితరులు అభినందించారు.

ఎర్రబారిన ఖమ్మం మార్కెట్!

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు బుధవారం ఎర్ర బంగారంగా పిలుచుకునే మిర్చి పంట పోటెత్తింది. మార్కెట్‌లో మిర్చికి కేటాయించిన పెద్ద యార్డుతో పాటు పక్కనే ఉన్న మరో యార్డు కూడా నిండిపోగా, మార్కెట్ పరిసరాల్లో రహదారుల వెంట కూడా మిర్చి బస్తాలు దింపారు. మార్కెట్ కమిటీకి అందిన సమాచారం ప్రకారం లక్ష బస్తాల ఎర్ర మిర్చి విక్రయానికి రాగా, మరో 25 వేల తాలు మిర్చి బస్తాలు కూడా తీసుకొచ్చారు. ప్రస్తుత సీజన్‌లో ఇదే అత్యధికమని అధికారులు తెలిపారు. –ఖమ్మంవ్యవసాయం



మిర్చి బస్తాలతో నిండిపోయిన ఖమ్మం మార్కెట్

క్లుప్తంగా

యువ ఓటర్ల నమోదుపై దృష్టి పెట్టాలి

అదనపు కలెక్టర్ రాంబాబు



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాంబాబు

అశ్వారావుపేటరూరల్ : అర్హులైన యువకులను ఓటర్లుగా నమోదు చేయడంపై ఆయా పార్టీలు దృష్టి సారించాలని అదనపు కలెక్టర్, నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పర్సా రాంబాబు సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆయన పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. ఓటు నమోదులో యువత తక్కువగా ఉంటోందని, ఈ లోటును భర్తీ చేయాలని అన్నారు. మార్పులు, చేర్పులు, మరణాలు, తప్పుల సవరణకు సంబంధిత ఫారాల ద్వారా దరఖాస్తు చేస్తే వాటిని పరిశీలించి చర్యలు చేపడతామని చెప్పారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ లావణ్య, వివిధ పార్టీల నాయకులు సత్యవరపు సంపూర్ణ, గన్నిన రామకృష్ణ, భూషి పాండు, ఎస్కే పాషా, ఎస్వీటీ కొండ తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులకు కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై మధుప్రసాద్

భద్రాచలం అర్బన్ : భద్రాచలం పోలీస్ స్టేషన్ పరిధిలో కొన్ని రోజుల నుంచి డ్రంక్ అండ్ డ్రైవ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మద్యం తాగి వాహనం నడుపుతున్న 30 మందిని పట్టుకున్నారు. వారికి బుధవారం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సై మధు ప్రసాద్ మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపేటప్పుడు వాహనదారులు తమ కుటుంబసభ్యుల గురించి ఒకసారి ఆలోచించుకోవాలని సూచించారు. మరోసారి మద్యం తాగి వాహనం నడిపితే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు.

తప్పుడు నోటిఫికేషన్లతో నిరుద్యోగుల ఆందోళన

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో ఉద్యోగాలంటూ ఫేక్ నోటిఫికేషన్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుండటంతో నిరుద్యోగులు ఆందోళన చెందుతున్నారు. కాంట్రాక్ట్ బేస్ ఉద్యోగాలకు నోటిఫికేషన్ వచ్చిందంటూ వారం రోజుల నుంచి కొందరు ప్రచారం చేస్తున్నారు. పీజీలు, డిగ్రీలు పూర్తి చేసి ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న వారు ఫేక్ నోటిఫికేషనా? ఒరిజినల్ నోటిఫికేషనా? అనే తెలియక కలవరపడుతున్నారు. డిజిగ్నేషన్, పోస్టుల సంఖ్య కూడా పేర్కొంటుండగా, కొందరు నమ్ముతున్నారు. ఈ విషయమై సింగరేణి రిక్రూట్‌మెంట్ సెల్ జీఎం కట్టా బసవయ్యను వివరణ కోరగా.. ఫేక్ నోటిఫికేషన్ ఇచ్చిన వారిని పట్టుకుంటామని తెలిపారు.


ఉరి వేసుకుని విద్యార్థిని ఆత్మహత్య

ఖమ్మంరూరల్: మండలంలోని తల్లంపాడు శివారు నర్సింహపురానికి చెందిన పదో తరగతి విద్యార్థిని ఇస్లావత్ సాహితి (14) అనుమానాస్పద స్థితిలో బుధవారం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. నేలకొండపల్లి మండలానికి చెందిన సాహితి కుటుంబం కూలీ పనులు చేస్తూ కొంతకాలంగా నర్సింహపురంలో ఉంటోంది. ఆమె తల్లంపాడు హైస్కూల్‌లో పదో తరగతి చదువుతుండగా, కొద్దిరోజులుగా మనోవేదనకు గురవుతున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో ఆమె ఉరి వేసుకుంది. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కేటీపీఎస్ పాత ప్లాంట్‌లో కాపర్ చోరీ?

పాల్వంచ: కేటీపీఎస్ పాత ప్లాంట్‌లో సైతం కాపర్ వైర్ చోరీ గుర్తైనట్లు సమాచారం. సెంట్రల్ స్టోర్స్ నుంచి చోరీకి గురైన సొత్తును రెండు రోజుల క్రితం జెన్‌కో విజిలెన్స్ డీఎస్పీ రమేశ్ ఓ స్క్రాప్ షాపులో పట్టుకున్నారు. పట్టుకున్న కాపర్‌వైరు స్టోర్స్‌కు సంబంధించినది కాదని తేలింది. అది పాత ప్లాంట్‌లో విభాగాలను తుక్కుగా మారుస్తున్న ప్రాంతం నుంచి చోరీ చేసినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. వాస్తవంగా పాత ప్లాంట్‌లో చోరీ చేసిన సొత్తా? లేక పట్టుకున్న సొత్తును తిరిగి ఇవ్వలేక షాపు యజమానిపై మరో చోరీని మోపుతున్నారా అనేది చర్చనీయాంశంగా మారింది. ఈవిషయమై విజిలెన్స్ డీఎస్పీ రమేశ్‌ను వివరణ కోరగా.. హెచ్ఆర్ కమర్షియల్ సంస్థకు చెందిన కాపర్ చోరీ అయిందని, వారే పోలీసులకు ఫిర్యాదు చేశారని తెలిపారు. పట్టణ ఎస్ఐ బి.రామును వివరణ కోరగా.. ఎలాంటి ఫిర్యాదు రాలేదని తెలిపారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.12,595

చూడముచ్చటగా..

- ఒకే పోలిక, అభిరుచులతో చిన్నారులు
- అపురూపాలను చూసి మురిసిపోయే తల్లిదండ్రులు

నేడు అంతర్జాతీయ కవలల దినోత్సవం

కవలలు అచ్చం ఒకేలా ఉండి అందరినీ తికమకపెడుతుంటారు. బంధువులు, స్నేహితులు, ఇరుగుపొరుగు, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు తరచూ గుర్తించలేక ఒకరనుకుని మరొకరిని పిలుస్తుంటారు. ఆ తర్వాత గుర్తిస్తుంటారు. కొందరిలో గుణాలు, అభిరుచులు ఒకేలా ఉంటాయి. నేడు కవలల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం...

–పాల్వంచరూరల్/కరకగూడెం

ఇద్దరూ మంచి మిత్రులు..



వై.రోషన్, రోహిన్

ఏన్కూరుకు చెందిన ఇద్దరు కవలలు వై.రోషన్, రోహిన్ పాల్వంచ లక్ష్మీదేవిపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నారు. ఇద్దరు మిత్రుల్లా కలిసిమెలిసి ఉంటారని తల్లిదండ్రులు నరేష్, గీత తెలిపారు.

ఏది కొన్నా సమానమే..



కుంజా అభిరాం, లక్ష్మణ్‌పార్థు

పాల్వంచ మండలం దంతలబోరు పంచాయతీ గంగాదేవిగుప్ప గ్రామానికి చెందిన కుంజా అభిరాం, లక్ష్మన్‌పార్థు కవలలు. వీరు గ్రామంలోనే 3వ తరగతి చదువుతున్నారు. ఇద్దరి ఇష్టాలు ఒకేలా ఉంటాయి. ఏదికొన్న ఇద్దరికి సమానంగా ఇవ్వాల్సిందేనని తల్లిదండ్రులు భద్రం, వెంకటరమణ తెలిపారు.

బాగా అల్లరి..



శెట్టిపల్లి విజయలక్ష్మి, ప్రసన్నలక్ష్మి

పాల్వంచ మండలంలోని పునుకుల గ్రామానికి చెందిన శెట్టిపల్లి విజయలక్ష్మి, ప్రసన్నలక్ష్మి కవలు. అదే గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నారు. ఇద్దరు బాగా అల్లరిచేస్తారు. ఇష్టాలు, అభిరుచులు ఒకేలా ఉంటాయని తల్లిదండ్రులు వీరభద్రం, దేవేంద్రకుమారి తెలిపారు.

అభిరుచులు ఒకేలా..



మాలోతు చైత్రన్, చరణ్‌రాజ్

పాల్వంచ మండలం జగన్నాథపురానికి చెందిన మాలోతు చైత్రన్, చరణ్‌రాజ్ అదే గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నారు. ఇద్దరి అభిరుచులు ఒకేలా ఉంటాయి. రోజూ ఒకే రకం దుస్తులు వేసుకుంటారని తల్లిదండ్రులు రమేష్, సరిత తెలిపారు.

భలే హుషారు...



జాస్మిత, జాస్విత

కరకగూడెం మండలంలోని భట్టుపల్లి గ్రామానికి చెందిన ఇర్రి సంజీవ, సంధ్య దంపతులకు జాస్మిత, జాస్విత కవలలు జన్మించారు. వీరిలో ఒకరు 9, మరొకరు 8వ తరగతి చదువుతున్నారు. చదువుల్లో కూడా మేటిగా రాణిస్తుంటారు. ప్రతి పనిలో ఒకరిని మించి మరొకరు ఎంతో ఉత్సాహం కనబరుస్తుంటారు.

ఒకే ముఖకవళికలు..



నిహస్ సాయిరామ్, నివాస్ సాయిరామ్

కరకగూడెం మండలం అనంతారం గ్రామానికి చెందిన ప్రసాద్, విద్య దంపతులకు నిహస్ సాయిరామ్, నివాస్ సాయిరామ్ కవలలు జన్మించారు. ప్రస్తుతం యూకేజీ చదువుతున్న వీరు చూడముచ్చటగా ఉంటారు. ఒకే ముఖ కవళికలతో కనిపిస్తారు. తల్లిదండ్రులు వీరికి ఒకే మాదిరి దుస్తులు వేస్తుంటారు.

బంధువులు గుర్తుపట్టలేరు..



అనస్, అహద్

కరకగూడెం గ్రామానికి చెందిన షేక్ యాకుబ్ పాషా, రజియా దంపతులకు 10 నెలల కుమారులు అనస్, అహద్ కవలలు ఉన్నారు. రూపంలో ఒకేలా ఉంటారు. వీరిని బంధువులు కూడా గుర్తుపట్టలేరు. అచ్చం రూపంలో ఒకే పోలిక కలిగి ఉండటంతో తల్లిదండ్రులు మురిసిపోతుంటారు.

ఇరుగుపొరుగు తికమక..



యశ్విన్, యష్మత్

కరకగూడెం గ్రామానికి చెందిన ముంజలా సురేష్ రవళి దంపతులకు నాలుగేళ్ల యశ్విన్, యష్మత్ కవలలు ఉన్నారు. వీరు అచ్చం ఒకేలా ఉంటారు. వీరిని గుర్తుపట్టేందుకు ఇరుగుపొరుగు తికమక పడుతుంటారు. వీరు ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్తున్నారు.

ఆదివాసీలకు అండగా ఉంటాం

భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్



ఆదివాసీలకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఏఎస్పీ

చర్ల: ఆదివాసీలకు పోలీస్ శాఖ నిత్యం అండగా ఉంటుందని భద్రాచలం ఏఎస్పీ పరితోష్ పంకజ్ అన్నారు. మండలంలోని కిష్టారంపాడులో బుధవారం ఆదివాసీలకు దుస్తులు, వంట సామగ్రి, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని రకాల మౌలిక సౌకర్యాలు ఆదివాసీలకు అందేలా కృషి చేస్తామని చెప్పారు. మావోయిస్టులు ఆదివాసీల అభివృద్ధిని అడ్డుకుంటూ, వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని, అలాంటి వారిని దరిచేరనీయవద్దని అన్నారు. సంఘ విద్రోహశక్తులైన మావోయిస్టులు తమ స్వప్రయోజనం కోసం ఆదివాసీలను వాడుకుంటున్నారని అన్నారు. మావోయిస్టులకు ఎవరూ సహకరించవద్దని, ఎవరైనా సహకరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ రాజువర్మ, ఎస్సైలు టీవీఆర్ సూరి, నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన సమ్మక్క బంగారం ధర

భక్తులపై అదనంగా హమాలీ చార్జీల భారం



బంగారం(బెల్లం) తులాభారం వేస్తున్న దృశ్యం

కొత్తగూడెంటౌన్: సమ్మక్క– సారలమ్మ జాతర ప్రారంభం కావడంతో అమ్మవారికి సమర్పించే బంగారం(బెల్లం) ధర పెరిగింది. సాధారణంగా కేజీ బెల్లం రూ. 40 ఉండగా, ప్రస్తుతం వ్యాపారులు రూ. 50 వరకు విక్రయిస్తున్నారు. సమ్మక్క తల్లికి భక్తులు నిలువెత్తు బంగారం సమర్పిస్తుండటంతో, వ్యాపారులు ధరలు పెంచారు. జిల్లా నుంచి పలువురు భక్తులు ములుగు జిల్లాలోని మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరకు వెళ్తున్నారు. జిల్లాలో కూడా పలుచోట్ల మినీ జాతరలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బెల్లం అధిక ధరకు విక్రయించడంతోపాటు అదనంగా హమాలీ చార్జీల భారం భక్తులపై మోపుతున్నారు. హమాలీ చార్జీలు రూ. 40 నుంచి రూ. 80 వరకు వసూళ్లు చేస్తున్నారు. దీంతో భక్తులపై ఆర్థికభారం తప్పడంలేదు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



రోడ్డు పక్కకు దూసుకెళ్లిన బస్సు

గుండాల: ప్రయాణికులతో మేడారం జాతరకు వెళ్లి వస్తున్న ఓ ఆర్టీసీ బస్సు అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ఖమ్మం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు మేడారం జాతరకు గుండాల మీదుగా ఖమ్మం వెళ్తోంది. ఈ క్రమంలో గుండాల, ఇల్లెందు మధ్య మామకన్ను సమీపంలో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. బస్సులో నలుగురు ప్రయాణికులు ఉండగా స్వల్ప గాయాలతో బయటపడ్డారు. దీంతో పెను ప్రమాదం తప్పినట్లయింది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

ఇల్లెందురూరల్: మండలంలోని ఒడ్డుగూడెం గ్రామపంచాయతీ నెహ్రూనగర్ గ్రామ శివారులో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్రంగా గాయాలయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కోటగడ్డ గ్రామానికి చెందిన మద్దెల రాజు, నామాలపాడు గ్రామానికి చెందిన పూనెం ప్రశాంత్ బైక్‌పై ముకుందాపురం నుంచి నామాలపాడుకు వెళ్తున్నారు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న టాటా మ్యాజిక్ వాహనం ఢీకొట్టింది. దీంతో రాజును ఓ ఆటో డ్రైవర్ ఇల్లెందు ఆస్పత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం సిఫార్సు చేశారు. ప్రశాంత్‌ను నేరుగా ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. కాగా ప్రమాదానికి కారకుడైన టాటామ్యాజిక్ డ్రైవర్ వాహనాన్ని సమీపంలో వదిలేసి పారిపోయినట్లు స్థానికులు తెలిపారు. ఇల్లెందు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జూలూరుపాడులో ఒకరికి...

జూలూరుపాడు: మండలంలోని పడమటనర్సాపురంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. మాచినేనిపేట గ్రామ పంచాయతీ వాగొడ్డుతండాకు చెందిన బోడా మోహన్ బైక్‌పై పడమటనర్సాపురం వచ్చి తిరిగి ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఖమ్మం నుంచి కొత్తగూడెం వైపు వెళుతున్న కారు బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో మోహన్‌కు తీవ్రగాయాలు కాగా, చికిత్స నిమిత్తం 108 వాహనంలో కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు.

టిప్పర్ల అడ్డగింత.. టన్ను చేపల లూటీ



గ్రామస్తుల నిరసనతో చెరువు కట్టపై నిలిచిన టిప్పర్

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారం చెరువులో చేపల వేట కొనసాగుతుండగా, ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటున్నాయి. గ్రామంలో అందరికీ చేపలు విక్రయించటం లేదని ఆరోపిస్తూ స్థానికులు వాహనాలను అడ్డుకుంటున్నారు. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామున సైతం చెరువు కట్ట వద్ద చేపలు విక్రయించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు టిప్పర్లను అడ్డుకోవడంతో సదరు కాంట్రాక్టర్ పెద్దఎత్తున జన సమీకరణ చేయగా ఉద్రిక్తత నెలకొంది. చివరకు పోలీసుల జోక్యంతో టిప్పర్లను పంపించారు. అయితే, చేపలు డంపింగ్ చేసే ప్రాంతం వద్దకు సైతం గ్రామస్తులు వెళ్లి విక్రయించాలని కోరగా నససేమిరా అనడంతో ఘర్షణ జరిగింది. చివరకు గ్రామస్తులు ఆగ్రహంతో దాదాపు టన్ను చేపలను ఎత్తుకెళ్లారు. దీంతో చెరువుమాదారం చెరువు వద్ద కాంట్రాక్టర్ తన అనుచరులను భారీగా రంగంలోకి దింపిన నేపథ్యాన, అధికారులు స్పందించకుంటే గొడవలు జరిగే అవకాశముందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

దుమ్ముగూడెం: మండలంలోని బుర్రవేములా శివారులో పేకాటస్థావరంపై బుధవారం పోలీసులు దాడి చేశారు. నలుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసి, రూ. 4 వేల నగదు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. మరికొందరు పరారుకాగా, కేసు నమోదు చేసినట్లు సీఐ అశోక్ కుమార్ తెలిపారు.

విద్యార్థులను దండించిన ఉపాధ్యాయుడి సస్పెన్షన్

ఆర్‌సీఓ విచారణ, పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు



విద్యార్థుల నుంచి వివరాలు సేకరిస్తున్న ఆర్‌సీఓ

తిరుమలాయపాలెం: మండలంలోని మాదిరిపురం పరిధి గిరిజన గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు తెలుగులో మార్కులు తక్కువగా వచ్చాయని ఉపాధ్యాయుడు లక్ష్మణ్‌రావు మంగళవారం రాత్రి విచక్షణారహితంగా కొట్టడంతో పలువురి వీపులపై వాతలు తేలిన విషయం విదితమే. ఈ మేరకు ట్రైబల్ వెల్ఫేర్ గురుకులాల ఆర్‌సీఓ టీవీ రాజు బుధవారం పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి వివరాలు సేకరించారు. అనంతరం లక్ష్మణ్‌రావును సస్పెండ్ చేయాలని నివేదిక ఇవ్వగా, గురుకులాల కార్యదర్శి సీతాలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే, ఉపాధ్యాయుడిపై జేజే యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గిరిధర్‌రెడ్డి తెలిపారు. కాగా, గురుకులంలో జరిగిన ఘటనపై కలెక్టర్ గౌతమ్ ఆదేశాలతో తహసీల్దార్ రామకృష్ణ కూడా విచారణ జరిపి, ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

అశ్వారావుపేటరూరల్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి బుధవారం తెల్లవారుజామున మృతి చెందాడు. ఎస్ఐ శ్రీరాముల శ్రీను కథనం ప్రకారం.. మండలంలోని దురదపాడు గ్రామానికి చెందిన బంధం సారయ్య(33) ఇదే గ్రామానికి చెందిన బంధం వెంకటేష్ కలిసి ద్విచక్రవాహనంపై మంగళవారం రాత్రి స్వగ్రామానికి వస్తున్నారు. ఈ క్రమంలో కుడుములపాడు వద్ద వాహనం అదుపుతప్పి కింద పడటంతో సారయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. ఖమ్మం ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడిపై కేసు నమోదు

చండ్రుగొండ : ప్రేమపేరుతో యువతిని మోసం చేసిన యువకుడిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మాచినేని రవి తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని వెంకటియాతండాకు చెందిన ఓ యువతిని జర్పులతండాకు చెందిన యువకుడు కొన్నేళ్లుగా ప్రేమ పేరుతో లోబర్చుకున్నాడు. ఈ క్రమంలో ఇటీవల తనను వివాహం చేసుకోవాలని యువతి ఒత్తిడి తేగా యువకుడు నిరాకరించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రుణం పేరిట మోసం

ఇల్లెందురూరల్: మండలంలోని ఇందిరానగర్‌కు చెందిన ఐదుగురు మహిళలను రుణం పేరిట ఓ ముఠా మోసం చేసేందుకు యత్నించింది. బ్యాంకు అధికారుల విచారణతో అసలు విషయం వెలుగుచూసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. ఖమ్మానికి చెందిన ఓ ముఠా ఇల్లెందు ప్రాంత వ్యక్తిని మధ్యవర్తిగా ఎంచుకుని బ్యాంకు రుణాలు ఇప్పిస్తామని నమ్మబలికారు. ఐదుగురు మహిళల నుంచి ఆధార్‌కార్డు, పాన్‌కార్డు జిరాక్స్‌లు, రెండు పాస్‌ఫొటోలు స్వీకరించారు. ఓ ప్రైవేటు బ్యాంకులో ఖాతా తెరిచి కొద్ది రోజుల్లోనే వారి అకౌంట్‌లో కొంత సొమ్ము జమ చేశారు. ఆ నిధులను డ్రా చేయొద్దని చెప్పి చివరికివారే చెక్‌బుక్ సహాయంతో డ్రా చేసుకున్నారు. ఈ విషయం గమనించకముందే సదరు ముఠా సభ్యులు మరో బ్యాంకులో ఐదుగురు మహిళల పేరిట రుణం కోసం దరఖాస్తు చేసి మంజూరు చేయించుకున్నారు. చివరి క్షణంలో బ్యాంకు అధికారులు రుణం మంజూరైన మహిళలను విచారించేందుకు ఇందిరానగర్‌కు చేరుకోగా అసలు విషయం వెలుగుచూసింది. ప్రైవేటు బ్యాంకు అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపడుతున్నారు.

మూడు ఇసుక లారీలు స్వాధీనం

తల్లాడ: ఆంధ్రా ప్రాంతం నుంచి అక్రమంగా మూడు లారీల్లో ఇసుక తరలిస్తుండగా తల్లాడ రింగ్ రోడ్డు సెంటర్‌లో పోలీసులు పట్టుకున్నారు. ఆంధ్రాలోని కృష్ణా నదీ ప్రాంతం నుంచి ఇసుకను ఎలాంటి అనుమతి లేకుండా మూడు లారీల్లో తరలిస్తుండగా బుధవారం తెల్లవారుజామున 4 గంటలకు తల్లాడ సెంటర్‌లో ఎస్ఐ కొండల్‌రావు ఆధ్వర్యాన చేపట్టిన తనిఖీల్లో గుర్తించారు. ఈ మేరకు వాహనాలను స్వాధీనం చేసుకుని డ్రైవర్లు, యజమానులు దొండపాటి విష్ణు, గుడిద వెంకటేశ్వర్లు, దోమల దుర్గాప్రసాద్, కట్టా నరసింహారావు, పాలగాని మురళిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఏడు ఇసుక ట్రాక్టర్లు..

ఎర్రుపాలెం: మండలంలోని అయ్యవారిగూడెం ఇసుక రేవు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను స్థానిక పోలీసులు పట్టుకున్నారు. గ్రామంలోని ఇసుక రేవు నుంచి కొద్దిరోజులుగా కొందరు ఇసుకను తరలిస్తున్నారనే సమాచారంతో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఏడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని బాధ్యులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటేశ్ తెలిపారు.

ట్రాక్టర్ పైనుంచి జారిపడి ఇద్దరికి గాయాలు

అశ్వారావుపేటరూరల్: ట్రాక్టర్‌పై నుంచి జారి పడిన ఘటనలో బుధవారం రాత్రి ఇద్దరు వ్యక్తులకు గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని నారంవారిగూడెం గ్రామానికి చెందిన వీరంకి నాగమల్లేశ్వరరావు, బోయిన మహేష్ కలిసి వ్యవసాయ పనులకు వెళ్లారు. పనులు ముగిశాక ట్రాక్టర్‌పై ఇళ్లకు వెళ్తుండగా, గ్రామ సమీపంలో ప్రమాదవశాత్తు జారి కిందపడ్డారు. దీంతో తీవ్రగాయాలు కాగా, చిట్టితల్లి అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం సీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి ఖమ్మం తీసుకెళ్లారు.

కాలుష్య నిర్ధారణ యంత్రాల తొలగింపునకు యత్నం

సత్తుపల్లి: కాలుష్య నియంత్రణ మండలి అధికారులు వెళ్లిన గంటల్లోనే కాలుష్య తీవ్రతను గుర్తించే యంత్రాన్ని తొలగించేందుకు ఉద్యోగులు యత్నించగా.. మండలంలోని కిష్టారం అంబేడ్కర్ కాలనీ వాసులు అడ్డుకున్నారు. ఇక్కడ మంగళవారం కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పర్యటించగా పలువురి ఇళ్లపై కాలుష్య తీవ్రతను గుర్తించే యంత్రాలను అమర్చారు. కానీ బుధవారం వీటిని తొలగిస్తుండగా స్థానికులు అడ్డుకున్నారు. తమ ప్రాంతంలో అభివృద్ధి చేయకున్నా పర్వాలేదు, కాలుష్యం రాకుండా చూడాలని స్థానికులు కిష్టారం పీఓ నర్సింహారావుతో వాగ్వాదానికి దిగారు. కార్యక్రమంలో మారోజు శ్రీను, పాలకుర్తి రాజు, జయరాజు, మారోజు నాగేశ్వరరావు, కమలమ్మ, నాగేశ్వరరావు, రమేష్, నక్కా రాంబాబు, పిల్లి తిరుపతమ్మ, వాడేపల్లి నాగమణి, కొండా నాగరత్నం, జంగం సుశీల తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం సీజ్

వైరా: ఎమ్మార్పీ కంటే అధిక మొత్తానికి మద్యం అమ్ముతున్నారనే ఫిర్యాదులతో తనిఖీ చేపట్టిన ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం వైరాలోని వైన్స్ షాప్‌ను సీజ్ చేశారు. వ్యవసాయ మార్కెట్ ఎదురుగా ఉన్న శ్రీనివాస శబరి వైన్స్‌ను సీజ్ చేసి, లైసెన్స్ సస్పెండ్ చేశారు. ఈ మేరకు వైరా ఎక్సైజ్ సీఐ మమత వివరాలు వెల్లడించారు.

ముమ్మాటికీ ఆర్థిక నేరస్తుడే

'మార్గదర్శి' పేరిట రామోజీ అక్రమ ఆర్థిక సామ్రాజ్యం ● ఆర్‌బీఐ చట్టానికి విరుద్ధంగా డిపాజిట్ల సేకరణ

నల్ల గురివింద
రామోజీ-1

- అవి అక్రమ డిపాజిట్లేనని సుప్రీంకోర్టులో ఆర్‌బీఐ వెల్లడి
- 2006 నాటికే రూ.2,600 కోట్ల అక్రమ డిపాజిట్లు
- కేసులు విచారణలో ఉండగా మరో రూ.2 వేల కోట్లు
- ఆ ముసుగులో భారీగా నల్లధనం దందా
- రామోజీ అక్రమాలకు చెక్ పెట్టిన నాటి వైఎస్సార్ ప్రభుత్వం
- అక్రమ డిపాజిట్లు తిరిగి చెల్లించేశామంటూ రాజగురువు బుకాయింపు
- ఎవరి నుంచి సేకరించారు.. ఎవరికి చెల్లించారో మాత్రం చెప్పరట
- నగదు రూపంలో డిపాజిట్ల సేకరణ చట్ట విరుద్ధమన్న ఐటీ శాఖ
- ఆర్‌బీఐ స్టేట్‌మెంట్ నేపథ్యంలో రామోజీకి శిక్షపై సర్వత్రా చర్చ



సాక్షి, అమరావతి: మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాల్లో గుట్టుచప్పుడు కాకుండా 'మార్గదర్శి ఫైనాన్సియర్స్'పేరిట ఏళ్ల తరబడి సాగించిన అక్రమ డిపాజిట్ల వసూళ్లు.. నల్లధనం దందాపై 2006లో అప్పటి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన చర్యలు ఎట్టకేలకు ఫలించాయి. మార్గదర్శి ఫైనాన్షియర్స్ పేరిట రామోజీరావు అక్రమ డిపాజిట్లు వసూలు చేశారని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) సుప్రీంకోర్టుకు విస్పష్టంగా నివేదించింది. దాంతో రామోజీ అవినీతి ఆట కట్టిందని, ఇక శిక్ష పడటమే మిగిలిందని నిపుణులు ఏకాభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. కనీసం రెండేళ్ల నుంచి గరిష్టంగా యావజ్జీవ జైలు శిక్ష పడే అవకాశం ఉందని కూడా చెబుతుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. దాంతో మార్గదర్శి ఫైనాన్షియర్స్ పేరిట రామోజీరావు సాగించిన ఆర్థిక అక్రమాల కథ కమామిషు మరోసారి దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. 2006లో అప్పటి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం ప్రశ్నించే వరకు ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్‌లో 'మార్గదర్శి ఫైనాన్షియర్స్'అనే సంస్థ ఉన్నట్టు కూడా సామాన్యులకు తెలియదు. రాష్ట్రం అంతటా 'మార్గదర్శి చిట్ ఫండ్స్'కార్యాలయాలే కనిపిస్తూ ఉండేవి. కానీ ఆ కార్యాలయాల్లోనే గుట్టు చప్పుడు కాకుండా 'మార్గదర్శి ఫైనాన్షియర్స్'పేరిట మరో కంపెనీ ఆర్థిక కార్యకలాపాలు సాగించేదనే విషయం బయటి ప్రపంచానికి తెలీదు. అలా 1997 నుంచి 2006 వరకు మార్గదర్శి ఫైనాన్షియర్స్ యథేచ్ఛగా కార్యకలాపాలు సాగించింది.

భారీగా అక్రమ డిపాజిట్లు సేకరణ

ఆర్‌బీఐ నిబంధనలకు విరుద్ధంగా రామోజీరావు మార్గదర్శి ఫైనాన్షియర్స్ పేరిట భారీగా అక్రమ డిపాజిట్లు సేకరించారు. డిపాజిట్ల సేకరణ పేరిట ప్రజలను మోసం చేయకుండా కట్టడి చేసేందుకు ఆర్‌బీఐ స్పష్టమైన విధివిధానాలను నిర్దేశించింది. ఆర్‌బీఐ చట్టంలోని 45ఎస్ ప్రకారం కంపెనీల చట్టం ప్రకారం నమోదైన ఇన్‌కార్పొరేటెడ్ కంపెనీలు మాత్రమే ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించాలి. రామోజీరావు తన గ్రూపు సంస్థలను 'హిందూ అవిభాజ్య కుటుంబం(హెచ్‌యూఎఫ్) కింద నమోదు చేసినట్టుగా పేర్కొన్నారు. హెచ్‌యూఎఫ్ కింద నమోదైన కంపెనీలు ప్రజల నుంచి డిపాజిట్లు వసూలు చేయకూడదు. కానీ చట్టానికి తాను అతీతం అని భావించే రామోజీ ఈ నిబంధనను నిర్భీతిగా బేఖాతరు చేశారు. మార్గదర్శి ఫైనాన్సియర్స్ పేరిట యథేచ్ఛగా డిపాజిట్లు వసూలు చేశారు. 2006లో మార్గదర్శి ఫైనాన్షియర్స్ అక్రమ డిపాజిట్ల వ్యవహారం వెలుగులోకి వచ్చే నాటికి ఏకంగా రూ.2,600 కోట్ల అక్రమ డిపాజిట్లను సేకరించడం విభ్రాంతికర వాస్తవం. కాగా మార్గదర్శి ఫైనాన్షియర్స్‌పై కేసు న్యాయస్థానంలో విచారణలో ఉండగా మరో రూ.2 వేల కోట్ల వరకు అక్రమ డిపాజిట్లు సేకరించారని రాష్ట్ర ప్రభుత్వ న్యాయవాది నిరంజన్ రెడ్డి సుప్రీంకోర్టుకు నివేదించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

> ఈనాడు పత్రికాధిపతి చెరుకూరి రామోజీరావు ఆర్థిక నేరస్తుడే అన్నది నిగ్గు తేలింది. టీడీపీ అధినేత చంద్రబాబు రాజగురువు రామోజీ ఆర్థిక ఉగ్రవాదేనన్నది స్పష్టమైంది. 'మార్గదర్శి' ముసుగులో భారీగా నల్లధనం దందా నిర్వహిస్తున్నారన్నదీ రూఢీ అయ్యింది. అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు తొడుక్కున్న 'పత్రికా స్వేచ్ఛ' అనే ముసుగు తొలగిపోయింది. చట్టాలను ఉల్లంఘిస్తూ ఆర్థిక అక్రమాలకు పాల్పడ్డ రామోజీ నిజ రూపంలో అవినీతి దిగంబరుడిగా నిలబడ్డాడు.
>
> మార్గదర్శి ఫైనాన్షియర్స్ అక్రమ డిపాజిట్లు వసూలు చేసిందని ఆర్‌బీఐ స్పష్టం చేయడంతో ఈ కేసులో తరువాత పరిణామాలు ఏమిటన్నది చర్చనీయాంశంగా మారింది. అక్రమ డిపాజిట్ల కేసు నిరూపితమైతే ఏకంగా రెట్టింపు జరిమానా అంటే రూ.5,200 కోట్ల జరిమానాతోపాటు కనీసం రెండేళ్ల నుంచి యావజ్జీవ జైలుశిక్ష విధించే అవకాశాలున్నాయని న్యాయ నిపుణులు చెబుతున్నారు.

తప్పు ఒప్పుకోక తప్పని రామోజీ

మార్గదర్శి ఫైనాన్షియర్స్ అక్రమ డిపాజిట్ల దందా బయటపడటంతో రామోజీరావు కంగుతిన్నారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం మార్గదర్శి ఫైనాన్షియర్స్ అక్రమాలపై దర్యాప్తు చేసేందుకు అప్పటి ప్రభుత్వ సలహాదారు రంగాచారిని విచారణ అధికారిగా నియమించింది. ఈ అక్రమాలపై సీఐడీ తరపున న్యాయ స్థానాల్లో కేసులు దాఖలు చేసేందుకు టి.కృష్ణంరాజును అధీకృత అధికారిగా నియమించింది. మార్గదర్శి ఫైనాన్షియర్స్ పేరిట ఏకంగా రూ.2,600 కోట్ల అక్రమ డిపాజిట్లు సేకరించినట్టు వీరు గుర్తించారు. కాగా తాము చట్టాన్ని ఉల్లంఘించలేదని బుకాయించేందుకు రామోజీ యత్నించారు. హెచ్‌యూఎఫ్‌గా తాము ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించవచ్చని అడ్డగోలుగా వాదించారు. కానీ సెక్షన్ 45 ఎస్ ప్రకారం హెచ్‌యూఎఫ్‌లు డిపాజిట్లు సేకరించకూడదని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. దాంతో తాము తప్పు చేసినట్టు రామోజీరావు అంగీకరించారు. నగదు రూపంలో డిపాజిట్లు వసూలు చేసినట్టు కూడా సమ్మతించారు. తమ తప్పును అంగీకరిస్తూ డిపాజిట్‌దారులకు వారి డిపాజిట్లను తిరిగి చెల్లించేస్తామని, మార్గదర్శి ఫైనాన్షియర్స్‌ను మూసి వేస్తామని న్యాయస్థానానికి లిఖిత పూర్వకంగా తెలిపారు.

వివరాలు చెప్పం అని వితండవాదం

తాము అక్రమంగా వసూలు చేసిన డిపాజిట్లను సంబంధిత డిపాజిట్‌దారులకు తిరిగి చెల్లించేశామని రామోజీరావు న్యాయస్థానానికి తెలిపారు. కాగా అక్రమ డిపాజిట్లు ఎవరెవరి నుంచి సేకరించారు.. ఎవరెవరికి తిరిగి చెల్లించారో ఆ వివరాలు వెల్లడించాలని సీఐడీ, ఉండవల్లి అరుణ్‌కుమార్ కోరినప్పటికీ రామోజీరావు సమ్మతించ లేదు. ఆ వివరాలు తాము వెల్లడించాల్సిన అవసరం లేదని వితండ వాదం చేశారు. కాగా అక్రమంగా డిపాజిట్లు వసూలు చేసిన రామోజీరావును ప్రాసిక్యూట్ చేయాలని అధీకృత అధికారి కృష్ణంరాజు దాఖలు చేసిన పిటిషన్‌ను ఉమ్మడి హైకోర్టు తన చివరి పని దినాన కొట్టివేయడాన్ని సవాల్ చేస్తూ.. డిపాజిట్దారుల వివరాలు వెల్లడించాలని కోరుతూ ఉండవల్లి అరుణ్‌కుమార్ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో ఏపీ ప్రభుత్వం 2022లో ఇంప్లీడ్ అయ్యింది. డిపాజిట్‌దారుల వివరాలు వెల్లడించాల్సిందేనని సుప్రీంకోర్టు గత ఏడాది పేర్కొంది. కానీ ఇంత వరకు రామోజీరావు తమ డిపాజిట్‌దారుల వివరాలను వెల్లడించకపోవడం గమనార్హం.

నల్లధనం దందా వల్లే గప్‌చుప్

- మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయాల్లో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహించిన 'మార్గదర్శి ఫైనాన్షియర్స్'ముసుగులో రామోజీరావు భారీగా నల్లధనం దందాను సాగించారు.
- 2006 నాటికే ఏకంగా 32,385 మంది నుంచి రూ.2,600 కోట్ల వరకు అక్రమంగా డిపాజిట్లు సేకరించారని వెల్లడైంది. కానీ వారి పేర్లు, వివరాలను మాత్రం వెల్లడించేందుకు రామోజీరావు ససేమిరా అంటుండటం గమనార్హం. ఎందుకంటే ఆ డిపాజిట్ల ముసుగులో టీడీపీ పెద్దలు భారీగా నల్లధనాన్ని చలామణిలోకి తీసుకువచ్చారు. అందుకే సీఐడీతోపాటు న్యాయస్థానం కోరినప్పటికీ వారి వివరాలను వెల్లడించేందుకు సమ్మతించడం లేదు.
- మార్గదర్శి ఫైనాన్షియర్స్ రశీదు రూపంలో సేకరించిన డిపాజిట్ల పత్రాలను పరిశీలిస్తే అదంతా నల్లధనం బాగోతమేనన్నది స్పష్టమవుతోంది. డిపాజిట్‌దారుల పాన్ నంబర్లు, చిరునామాలు కూడా లేకుండానే డిపాజిట్లు సేకరించడం గమనార్హం.
- మార్గదర్శి ఫైనాన్షియర్స్ డిపాజిట్‌దారులకు చెల్లించాల్సిన మొత్తం రూ.2,610.38 కోట్లుగా రామోజీరావు 2006లో తమ అఫిడవిట్‌లో పేర్కొన్నారు. కానీ 2008లో సమర్పించిన అఫిడవిట్‌లో రూ.1,864.10 కోట్లు చెల్లించేశామని తెలిపారు. మరి మిగిలిన రూ.800 కోట్ల డిపాజిట్లు ఏమయ్యాయనే విషయంపై మౌనం వహించారు. గుట్టు చప్పుడు కాకుండా రికార్డుల నుంచి తొలగించిన ఆ రూ.800 కోట్లు రామోజీకి అత్యంత సన్నిహితుడైన పచ్చ బాబు, ఆయన గ్యాంగ్‌వే అని తెలుస్తోంది. పోనీ చెల్లించామని చెబుతున్న రూ.1,864.10 కోట్ల డిపాజిట్లు ఎవరెవరికి చెల్లించారో చెప్పడానికి రామోజీ ససేమిరా అంటున్నారు.

బాబుకు రెస్ట్!

35 ఏళ్లుగా పోటీ చేస్తున్నారు... రెస్ట్ అవసరమన్న భార్య

ఈ సారి కుప్పంలో పోటీ చేయాలనుకుంటున్నానన్న భువనేశ్వరి

ఈ మాటల వెనక కథ.. స్క్రీన్‌ప్లే.. దర్శకత్వం చంద్రబాబుదే

'సిద్ధం' సభలకు వెల్లువలా వస్తున్న జనాన్ని చూసి వెన్నులో వణుకు

(సాక్షి, అమరావతి-తిరుపతి-శాంతిపురం)



"35 ఏళ్లుగా మీరు చంద్రబాబు నాయుడు గారిని గెలిపిస్తున్నారు. ఇక ఆయనకు రెస్ట్ ఇవ్వాలనిపిస్తోంది. అందుకే ఈ సారి ఇక్కడి నుంచి నేను పోటీ చేయాలనుకుంటున్నాను" అంటూ చంద్రబాబు నాయుడి భార్య నారా భువనేశ్వరి బుధవారం కుప్పంలో ఓ బహిరంగ సభలో స్పష్టంగా చెప్పారు.

స్కిల్ కుంభకోణంలో వేల కోట్లు నేరుగా విత్‌డ్రా చేసుకుని మింగేసిన కేసులో ఈ మధ్య చంద్రబాబు నాయుడిని పోలీసులు అరెస్టు చేయటంతో ఆయన జైలుకు వెళ్లటం తెలిసిందే. అది జరిగిన 10–15 రోజుల తరవాత కూడా ఆయన జైలు జీవితాన్ని చూసి తట్టుకోలేక కొందరు మరణించారన్నది టీడీపీ–ఎల్లో మీడియా వ్యాఖ్యానం. వారందరికీ సాయం చెయ్యడానికి నేరుగా నారా భువనేశ్వరి ఓ యాత్ర చేస్తున్నారు. ఆమేమీ రాజకీయ నాయకురాలు కాదు. దీంతో యాత్రలో భాగంగా ఎక్కడికి వెళ్లాలి? ఎవరెవరిని కలవాలి? ఎవరికి చెక్కులివ్వాలి? ఏమేం మాట్లాడాలి? అనేది మొత్తం స్క్రిప్టు ప్రకారమే చేస్తున్నారు. బుధవారం మాట్లాడిన మాటలు కూడా ఆ స్క్రిప్టులో భాగమే. కళ్లెదుట ఓటమి స్పష్టంగా కనిపిస్తుండడంతో ఏదో ఒక వంకతో అక్కడి నుంచి పోటీ చేయకుండా జారుకోవాలనేది బాబు పన్నాగమని, అందుకే భార్యతో ఆ మాటలు మాట్లాడించారు తప్ప అవేమీ చమత్కారమో, యథాలాపమో కావని టీడీపీ వర్గాలే చెబుతున్నాయి.

కుప్పంలో పడిపోయిన బాబు గ్రాఫ్...

కుప్పం బరి నుంచి పక్కకు తప్పుకొని వేరే నియోజకవర్గం చూసుకోవాలని, లేకపోతే ఈ సారి ఎన్నికల్లో పోటీయే చేయకుండా నాన్ ప్లేయింగ్ కెప్టెన్‌గా వ్యవహరించాలని బాబు ఆలోచిస్తున్నట్లు టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. కుప్పంలో బాబు గ్రాఫ్ అంతకంతకూ దారుణంగా పడిపోవటం దీనికి మొదటి కారణం. నిజానికి 2019 ఎన్నికల్లోనే ఆయన మెజారిటీ బాగా తగ్గిపోవటం నుంచి ఈ గ్రాఫ్ పతనం మొదలయింది. ఆ తర్వాత జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో చంద్రబాబు చేతి నుంచి కుప్పం జారిపోయింది. మున్సిపల్ ఎన్నికల్లో కుప్పం మున్సిపాలిటీని వైఎస్సార్‌సీపీ చేజిక్కించుకుంది. 25 వార్డుల్లో టీడీపీ కేవలం 7 వార్డుల్లో గెలవగా మిగిలిన 18 వార్డుల్లోనూ వైఎస్సార్ సీపీ అభ్యర్థులు జయకేతనం ఎగురవేశారు. అంతకుముందు జరిగిన పంచాయతీ ఎన్నికల్లో 89 పంచాయతీలకు గాను 70 పంచాయతీలను వైఎస్సార్‌సీపీ గెలుచుకుంది. నాలుగు జెడ్పీటీసీలు, నాలుగు ఎంపీపీ స్థానాల్లో కూడా టీడీపీ ఓడిపోయింది. ఈ ఫలితాలన్నీ కుప్పంలో చంద్రబాబు పని అయిపోయినట్లేనని స్పష్టంగా చెప్పాయి.

'సిద్ధం' సభలతో ఉక్కిరి బిక్కిరి

చంద్రబాబు ప్రతి పార్లమెంటు నియోజకవర్గంలోనూ 'రా... కదలిరా' పేరిట సభలు నిర్వహించారు. మరోవైపు లోకేశ్ 'శంఖారావం' పేరుతో సభలు పెట్టారు. ఇక నారా భువనేశ్వరి 'నిజం గెలవాలి' అంటూ సమావేశాలు పెడుతున్నారు. వైఎస్సార్ సీపీ తరఫున వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఒక్కరే... 'సిద్ధం' అంటూ సభలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే మూడు ప్రాంతాల్లో సభలు నిర్వహించారు. బాబు...లోకేశ్... భువనేశ్వరి సభలన్నిట్లోనూ కలిపినా... రాప్తాడులో జరిగిన సిద్ధం సభకు వచ్చిన జనాల్లో సగం కూడా రాలేదు. 'సిద్ధం' సభలు మూడూ ఒకదాన్ని మించి మరొకటి జనసంద్రాలయ్యాయి. జనం నాడి అర్థమైన చంద్రబాబుకు వణుకు మొదలైంది. అందుకే పొత్తులతోనైనా ఎలాగోలా పరువు నిలబెట్టుకోవాలని ప్రయత్నిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో కుప్పంలో కూడా తాను ఓడిపోతే పరిస్థితి దయనీయంగా మారుతుందని, పార్టీ చేజారిపోతుందని అర్థమై.. ఈ సారికి వేరే చోట నుంచి పోటీ చెయ్యడమో... లేకపోతే ఎక్కడా పోటీ చేయకుండా నాన్ ప్లేయింగ్ కెప్టెన్‌లా వ్యవహరించి పరువు నిలుపుకోవటమో చేయాలని చూస్తున్నారన్నది పార్టీ వర్గాల మాట.

జిల్లా వార్తలు

హానరరీ డైరెక్టర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం ఎస్సీ స్టడీ సర్కిల్‌లో హానరరీ డైరెక్టర్‌గా పనిచేసేందుకు ఆసక్తి కలిగిన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీడీ కస్తాల సత్యనారాయణ తెలిపారు. పీజీ విద్యార్హత కలిగి, పోటీ పరీక్షల నిమిత్తం విద్యాసంస్థను నిర్వహించిన వారే కాక విద్యావ్యవస్థకు సంబంధించి రిటైర్డ్ ఉద్యోగుల్లో 65 ఏళ్లు దాటని వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలు, ఫొటోలతో పాటు బయోడేటాను తమ కార్యాలయంలో ఈ నెల 26వ తేదీలోగా అందించాలని డీడీ సూచించారు.

17 మంది అధికారుల బదిలీ

సింగరేణి (కొత్తగూడెం): సింగరేణిలోని వివిధ ఏరియాలు, విభాగాల్లో పనిచేస్తున్న 17 మంది అధికారులను బదిలీ చేశారు. ఇందులో ఇద్దరు ఏజీఎంలు, ఆరుగురు డీవైజీఎంలు, ఒక ఎస్‌ఓఎం, ఇద్దరు కాలరీ మేనేజర్లు, నలుగురు అడిషనల్ మేనేజర్లు, ఇద్దరు డిప్యూటీ మేనేజర్లు ఉన్నారు. కాగా, ఆర్థిక సంవత్సరం ముగిసే సమయం సమీపిస్తున్న నేపథ్యాన బదిలీలు, డిప్యూటేషన్లను రద్దు చేస్తున్నట్లు యాజమాన్యం కొన్నాళ్ల కిందట ఉత్తర్వులు జారీ చేసింది. కానీ, ఇప్పుడు ఉత్పత్తి విభాగాల్లోనే విధులు నిర్వర్తించే అధికారులను బదిలీ చేయడాన్ని కార్మికులు తప్పుపడుతున్నారు.

నిత్యాన్నదానానికి వితరణ

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామ చంద్ర స్వామి దేవస్థానంలో శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి బుధవారం హైదరాబాద్‌కు చెందిన భక్తులు విరాళం అందజేశారు. సరూర్‌నగర్‌కు చెందిన కొణిదెన శ్రీరామశర్మ రూ.1,00,116ను అధికారులకు అందించగా, స్వామి దర్శనం చేయించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు లింగాల సాయిబాబు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘాటెక్కిన వెల్లుల్లి



- కిలో రూ.370 నుంచి రూ.450 వరకు పలుకుతున్న ధర
- దిగుబడులు తగ్గటంతో పంటకు డిమాండ్
- మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్ నుంచి దిగుమతి
- శుభకార్యాలు, పచ్చళ్ల సీజన్ కావడంతో డిమాండ్

ఖమ్మంవ్యవసాయం: వెల్లుల్లి ధర ఘాటెక్కింది. దాదాపు ప్రతి వంటలో వినియోగించే వెల్లుల్లి ప్రస్తుత ధరలను చూస్తుంటే సామాన్యుడికి దూరమయ్యే పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం కిలో వెల్లుల్లి పాయల ధర రూ.370 నుంచి రూ.450 వరకు పలుకుతోంది. ఈ ఏడాది పంటకు ప్రతికూల పరిస్థితులు నెలకొనటంతో దిగుబడులు తగ్గాయని దీంతో ధరకు రెక్కలొచ్చాయని వ్యాపారులు చెబుతున్నారు. సంక్రాంతి వరకు కిలో రూ.250 వరకు పలకగా.. కొత్త పంట వచ్చిన తరువాత ధరలు పెరిగినట్లు విక్రయదారులు చెబుతున్నారు. సుమారు నెల రోజులుగా వెల్లుల్లికి క్రమంగా ధర పెరిగింది.

వినియోగంపై ధర ప్రభావం

వెల్లుల్లి వినియోగంపై ధర ప్రభావం చూపుతోంది. సాధారణంగా రూ.100 నుంచి రూ.140 వరకు ఉండే వెల్లుల్లిని కూరల్లో మసాలా దినుసుగా వినియోగిస్తారు. పావు కిలో వెల్లుల్లి రూ.25 నుంచి రూ.35 వరకు లభించేది. అలాంటిది పావు కిలో పచ్చివైతే రూ.90కి పెరిగింది. ఆరిపోయిన వెల్లుల్లి అయితే రూ.115 వరకు విక్రయిస్తున్నారు. ఈ ధరలతో సామాన్యులు వెల్లుల్లిని కొనుగోలు చేయడానికి వెనుకంజ వేస్తున్నారు. పావుకిలో కొనుగోలు చేసేవారు 100 గ్రాములు కొనుగోలు చేసి సరిపెట్టుకుంటున్నారు.

ఉత్తరాది రాష్ట్రాల నుంచి దిగుమతి

దేశంలో వెల్లుల్లి పంటకు కొన్ని ప్రాంతాలు మాత్రమే అనుకూలంగా ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల నేలలు, వాతావరణం ఈ పంట సాగుకు అనుకూలంగా లేదు. మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో రైతులు అక్కడక్కడా వెల్లుల్లి పంటను సాగు చేస్తున్నారు. అక్కడ పండించే వెల్లుల్లిని మన ప్రాంతానికి వ్యాపారులు దిగుమతి చేసుకొని విక్రయిస్తున్నారు. గతంలో ఇక్కడ వ్యాపారులు ఆర్డర్ చేసిన వెంటనే లారీల్లో వెల్లుల్లిని అక్కడి వ్యాపారులు పంపించేవారు. ప్రస్తుతం ఆర్డరు చేసిన కొద్ది రోజుల తరువాత పంపిస్తున్నారు. అక్కడ పంట దిగుబడులు లేకపోవటంతో డిమాండ్ పెరిగింది.

శుభకార్యాలు, పచ్చళ్ల సీజన్ కూడా మరో కారణం

ప్రస్తుతం శుభకార్యాలు ఉండటం, మరో వైపు పచ్చళ్ల సీజన్ కూడా ప్రారంభం కావటంతో వెల్లుల్లికి డిమాండ్ పెరిగింది. వివాహాలు, గృహ ప్రవేశాలు, ఇతర జాతరలు వంటి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. కార్యక్రమాల్లో మాంసాహారం, శాఖాహారాల్లో వెల్లుల్లి వినియోగం కొంత ఎక్కువగానే ఉంటుంది. మిర్చి సీజన్ కావటంతో పండుమిరప కాయల పచ్చడిని పెడుతున్నారు. ఈ పచ్చడిలో కూడా వెల్లుల్లిని వినియోగిస్తుంటారు. దీంతో వినియోగం కూడా పెరిగింది. ఓ వైపు పంట దిగుబడి తగ్గటం, మరో వైపు శుభకార్యాలు, పచ్చళ్లకు వినియోగం పెరగటంతో ధరకు రెక్కలొచ్చాయి. ఇదిలా ఉండగా సామాన్యుల వినియోగం తగ్గినట్లు వ్యాపారులు చెబుతున్నారు.

వెల్లుల్లి వినియోగం తప్పనిసరి..



కూరల్లో, పచ్చళ్లలో నిత్యం వెల్లుల్లిని వినియోగిస్తాం. ధర ఎలా ఉన్నా వినియోగించాల్సిందే. వెల్లుల్లి వేస్తేనే కూరలు రుచికరంగా ఉంటాయి. ఇక వెల్లుల్లి ఆరోగ్యకరం కూడా. ప్రతి 10 రోజులకు పావు కిలో వెల్లుల్లిని వినియోగిస్తాం. ధర పెరిగినా వినియోగించక తప్పటం లేదు.

– ఆనం శాంతకుమారి, ముస్తఫానగర్, ఖమ్మం

ధర బారమైంది..



వెల్లుల్లి ధర బాగా పెరిగింది. గతంలో కిలో ధర ప్రస్తుతం పావు కిలో ధరలు సమానంగా ఉన్నాయి. పదిహేను రోజులకు ఒకసారి పావు కిలో చొప్పున కొనుగోలు చేసేవాళ్లం. ప్రస్తుతం 100 గ్రాముల చొప్పున కొనుగోలు చేయాల్సి వస్తోంది. ధర ఎంతో భారంగా ఉంది.

– ఆసిఫా బేగం, ధంసలాపురం, ఖమ్మం

కాలుష్య తీవ్రతను తగ్గిస్తాం..

ఆయిల్‌ఫెడ్ ఎండీ సురేందర్‌రెడ్డి



ఫ్యాక్టరీ మేనేజర్లతో మాట్లాడుతున్న ఎండీ

దమ్మపేట/అశ్వారావుపేట రూరల్: అధునాతన యంత్రాల వాడకం ద్వారా పామాయిల్ ఫ్యాక్టరీల నుంచి వెలువడే కాలుష్య తీవ్రతను తగ్గించడానికి ప్రయత్నిస్తున్నామని తెలంగాణ ఆయిల్‌ఫెడ్ మేనేజింగ్ డైరెక్టర్ సురేందర్‌రెడ్డి వెల్లడించారు. దమ్మపేట మండలం అప్పారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీ విస్తరణ పనులను ఎండీ పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యుత్ ప్లాంట్, బాయిలర్లు, టర్బయిన్లను పరిశీలించి అధికారులతో సమావేశమయ్యారు. విస్తరణ పనులు త్వరగా పూర్తి చేసి, రాబోయే సీజన్‌కల్లా అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. కాగా, ఫ్యాక్టరీ సామర్థ్యం పెంచే పనుల్లో భాగంగా అధునాతన యంత్ర సామగ్రిని అమరుస్తుండటంతో వాయు, జల కాలుష్య తీవ్రత చాలావరకు తగ్గనుందని తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు భూ యాజమాన్య హక్కు పత్రాలు లేకపోయినా రైతులకు ఆయిల్‌పామ్ మొక్కలు సబ్సిడీపై అందజేస్తామని ఎండీ వెల్లడించారు. అలాగే, అశ్వారావుపేటమండలం మద్దికొండ గ్రామంలోని రైతుల ఆయిల్‌పాం తోటలను ఎండీ సురేందర్‌రెడ్డి పరిశీలించారు. రైతులకు సలహాలు ఇచ్చేందుకు క్షేత్ర పర్యవేక్షకులను నియమించినట్లు తెలిపారు. ఈకార్యక్రమాల్లో ఆయిల్‌ఫెడ్ జనరల్ మేనేజర్ సుధాకర్‌రెడ్డి, డివిజనల్ అధికారి ఆకుల బాలకృష్ణ, ఫ్యాక్టరీ మేనేజర్లు కల్యాణ్, నాగబాబు, ఉద్యోగులు రాజశేఖరరెడ్డి, కార్తీక్, రాజేశ్, గోపాల్ పాల్గొన్నారు.

తపాలా శాఖ ఆధ్వర్యాన 'లెటర్ రైటింగ్' పోటీలు

ఖమ్మంగాంధీచౌక్: తపాలా శాఖ ఆధ్వర్యాన 'యూనివర్సల్ పోస్టల్ యూనియన్ (యూపీయూ)–2024 ఇంటర్నేషనల్ లెటర్ రైటింగ్ కాంపిటీషన్ ఫర్ యంగ్ పీపుల్' నిర్వహిస్తున్నట్లు ఖమ్మం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ బి.రవికుమార్ తెలిపారు. గతంతో పోలిస్తే ప్రపంచం చాలా మారిపోయింది.. భవిష్యత్ తరాల వారు ప్రపంచాన్ని ఎలా ఆశిస్తున్నారనే అంశంపై ఇంగ్లిష్ లేదా ఏదైనా ప్రాంతీయ భాషలో 800 పదాల్లో లేఖ రాయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. 9 నుంచి 15 ఏళ్ల మధ్య విద్యార్థులు అర్హులని, పోటీల్లో పాల్గొనదలచిన వారు ఈనెల 29వ తేదీ వరకు దరఖాస్తులను 'సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీస్, ఖమ్మం డివిజన్, ఖమ్మం – 507003' చిరునామాకు పంపించాలని సూచించారు. అనంతరం మార్చి 10న పరీక్ష నిర్వహించగా విజేతలకు నగదు బహుమతులు అందజేస్తామని తెలిపారు. పోస్టల్ సర్కిల్ స్థాయిలో మొదటి మూడు విజేతలకు రూ.25 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, జాతీయ స్థాయిలో మొదటి ముగ్గురు విజేతలకు రూ.50 వేలు, రూ.25 వేలు, రూ.10 వేల బహుమతులు ఉంటాయని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, పూర్తి వివరాలకు సమీపంలోని పోస్టాఫీస్‌లో సంప్రదించాలని సూపరింటెండెంట్ సూచించారు.

తెలంగాణలో కొబ్బరి సాగు విస్తరణే లక్ష్యం

కొబ్బరి అభివృద్ధి బోర్డు ప్రాంతీయ ఎఫ్‌ఓ సురేశ్



మాట్లాడుతున్న సీడీబీ ఫీల్డ్ ఆఫీసర్ సురేశ్

అశ్వారావుపేటరూరల్: తెలంగాణలో కొబ్బరి సాగుకు అనువైన ప్రాంతాల్లో తోటల విస్తరణే లక్ష్యంగా కొబ్బరి అభివృద్ధి బోర్డు మండలి (సీడీబీ) ప్రత్యేక కృషి చేస్తోందని బోర్డు ఫీల్డ్ ఆఫీసర్ సురేశ్ తెలిపారు. అశ్వారావుపేటలోని రైతు వేదికలో బుధవారం అశ్వారావుపేట, దమ్మపేట మండలాల సాగుదారుల సమావేశం నిర్వహించగా ఆయన మాట్లాడారు. కొబ్బరి సాగు పెంపుదల కోసం సాగు విస్తీర్ణ పథకంలో భాగంగా రైతులకు రాయితీలు, కూలీలకు బీమా సౌకర్యం కల్పిస్తున్నామని పేర్కొన్నారు. 2022–23లో 109 మంది రైతులకు రాయితీ కింద రూ.4.71 లక్షలు, 2023–24లో 55 మందికి రూ.1.98 లక్షల రాయితీ విడుదల చేయగా, ఆయా రైతులకు రెండో సంవత్సర రాయితీ నగదు త్వరలోనే జమ అవుతుందని తెలిపారు. అనంతరం ఉద్యాన అధికారి సందీప్ మాట్లాడుతూ.. అశ్వారావుపేట నియోజకవర్గంలో నాలుగు వేల ఎకరాల్లో వెయ్యి మందికి కొబ్బరి సాగు చేస్తున్నారని, రాయితీ పథకాల కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో కొబ్బరి రైతులు, ఉత్పత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆలపాటి రాంమోహన్‌రావు, కొక్కెరపాటి పుల్లయ్య, ఏఓ నవీన్, రైతులు శీమకుర్తి వెంకటేశ్వరరావు, మోరంపూడి శ్రీనివాసరావు, దొడ్డా లక్ష్మీనారాయణ, నున్నా కృష్ణ, తుంబూరు ఉమామహేశ్వరరెడ్డి, దొడ్డా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ మహరాజ్ అడుగుజాడల్లో నడవాలి



సేవాలాల్ చిత్రపటం వద్ద జ్యోతిప్రజ్వలన చేస్తున్న పీఓ, ఎమ్మెల్యే

భద్రాచలం: బంజారా జాతి ఆరాధ్య దైవమైన సేవాలాల్ మహరాజ్ అడుగు జాడల్లో నడవాలని, ఆయన ఆశయ సాధన కోసం గిరిజనులు కృషి చేయాలని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ సూచించారు. భద్రాచలంలోని గిరిజన భవనంలో బుధవారం జరిగిన సేవాలాల్ జయంతి ఉత్సవాలను ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ఆధ్వర్యాన భోగ్ బండారో పేరిట నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే, పీఓ పాల్గొని సేవాలాల్ చిత్రపటం వద్ద నివాళులర్పించి మాట్లాడారు. సేవాలాల్ అందరికీ ఆదర్శప్రాయుడని, జంతు బలిని వ్యతిరేకించి, మహిళలను గౌరవించాలని బోధించారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీఓ మంగీలాల్, ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, ఈఈ తానాజీ, ఏటీడీఓ నర్సింగరావు, సీఐ వెంకటేశ్వరరాజు, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ వీరూనాయక్‌తోపాటు హరిచంద్రనాయక్, ఎల్.వెంకటేశ్వర్లు, కృష్ణనాయక్, బి.బన్సీలాల్, బి.నాగులు, బి.సైదులు, బి.గోవిందు, బిచ్చానాయక్, బి.శ్వేత పాల్గొన్నారు.

'ఆత్మగౌరవ ప్రతీక' సంకలనం ఆవిష్కరణ



పుస్తకంతో వెంకయ్యనాయుడు, సంపాదకురాలు ఉష

ఖమ్మంగాంధీచౌక్: మేడారం సమ్మక్క – సారలమ్మ ప్రాశస్త్యం, మహాజాతరపై వెలువరించిన 'ఆత్మగౌరవ ప్రతీక'మహా సంకలనాన్ని బుధవారం హైదరాబాద్‌లో మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ మహా సంకలనానికి ఖమ్మానికి చెందిన కవయిత్రి బండి ఉష సంపాదకత్వం వహించారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. మేడారం జాతర తెలుగు ప్రజల ఆధ్యాత్మిక సంస్కృతిలో ముఖ్యమైనదని తెలిపారు. 535 మంది కవులు, కవయిత్రుల రచనలతో సంకలనం వెలువరించడం అభినందనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సాహితీవేత్త మట్టిగుంట వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వెంకయ్యనాయుడును కలిసిన ఎమ్మెల్సీ

ఖమ్మంమయూరిసెంటర్: మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయకుడును ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాత మధుసూదన్ హైదరాబాద్‌లో బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన వెంకయ్యనాయుడును సత్కరించారు.